రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో పలుచోట్ల ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశంలో పేదలకోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. – గచ్చిబౌలి/రాయదుర్గం/శేరిలింగంపల్లి



మసీదుబండలో.. నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, దళిత నాయకులు



హెచ్‌సీయూలో.. పూలమాల వేస్తున్న వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ డా.దేవేష్‌నిగమ్



మియాపూర్‌లో.. నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు



భెల్ టౌన్‌షిప్‌లో.. నివాళులర్పిస్తున్న భెల్ ఈడీ కే.బి.రాజా తదితరులు



నల్లగండ్లలో.. నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, విద్యార్థులు



గోపీనగర్‌లో.. కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ జనచైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

- ఈవెంట్ ఆర్గనైజర్లు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- నిబంధనలు అతిక్రమిస్తే కేసులు .. మాదాపూర్ ఏడీసీపీ జయరాం



సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్ తదితరులు

గచ్చిబౌలి: న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వాడినా, అనుమతించినా కఠిన చర్యలు తప్పవని మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం హెచ్చరించారు. శుక్రవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే ఆర్గనైజర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్స్, పబ్స్, కన్వెన్షన్ సెంటర్లు, ఇతర చోట్ల న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే వారంతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. సౌండ్ పొల్యూషన్‌పై హైకోర్టు నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని, అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. మైనర్లను పనిలో పెట్టుకోరాదని, అంతటా సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. ఇన్‌సైడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం ప్రైవేట్ సెక్యూరిటీని నియమించాలన్నారు. ఈవెంట్ ఉన్న చోట ఇన్‌సైడ్ పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, ప్రధాన రహదారులపై వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. పబ్‌లు, బార్ల నిర్వాహకులు డ్రైవర్లు, క్యాబ్‌లను అరేంజ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ సీహెచ్. శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు హబీబుల్లాఖాన్, వెంకన్న, ఈవెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



పనులు పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి ఉషాముళ్లపూడి రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు అలుగు వరకు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న వరద నీటి కాలువ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. అవసరమైన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, జిల్లా గణేష్, శివరాజ్ గౌడ్, రవి, మారెల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్, పార్కు పనుల పరిశీలన

ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ కాలనీలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్కు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి పీఏసీ చైర్మన్ గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, కోటి రూపాయల అంచనా వ్యయంతో చిల్డ్రన్ పార్కు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఫంక్షన్ హాల్‌ను అన్ని హంగులతో నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, మారెల్ల శ్రీనివాస్, శివరాజ్ గౌడ్, రవి, భాస్కర్, శ్రీనివాస్, యాదగిరి, అగ్రవాసు, మల్లేష్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.



పీజేఆర్ నగర్‌లో చిల్డ్రన్ పార్కు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గాంధీ

ఐఎంసీ సేవలు భేష్

మనూ వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉర్దూ భాష ద్వారా ప్రజలను జ్ఞానానికి అనుసంధానించడంలో ఉర్దూ విశ్వవిద్యాలయం లోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) సేవలు భేష్ అని 'మనూ' వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభివర్ణించారు .గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోని ఐఎంసీ సెంటర్ నిర్వహించే యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబర్లు లక్ష దాటిన సందర్భంగా శుక్రవారం ఆయన ఐఎంసీ సెంటర్ ప్రతినిధులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 80 లక్షల మంది వీక్షకులను కలిగి ఉండడం అభినందనీయమన్నారు. లక్ష మంది సబ్‌స్క్రైబర్స్ మైలురాయి దాటడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఐఎంసీ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: గంగారంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితాగౌడ్, గురుస్వాములు ప్రసాద్‌రావు, శ్రీనివాస్, అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

గణేష్‌గడ్డ దేవస్థానం హుండీ లెక్కింపు

100 రోజుల హుండీ ఆదాయం రూ.28 లక్షలు

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానంలో హుండీని శుక్రవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ లావణ్య సమక్షంలో లెక్కించారు. 100 రోజుల హుండీ ఆదాయం రూ.28 లక్షల 42 వేలు, అన్నదాన హుండీ ఆదాయం రూ. ఒక లక్ష 61 వేలు వచ్చినట్లు ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సంతోషిజోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై ఐక్యంగా పోరాడాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

రాయదుర్గం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందించిన పోస్టర్లను వీసీ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో డ్రగ్స్ సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. ఇటీవల సమాజంలో డ్రగ్స్ వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సామాజిక దురాగతాలకు దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సెల్ త్వరలో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో సహకారంతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ అధికారులు, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అవసరం.. న్యాయం చేస్తాం

తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి



రాష్ట్ర హోంగార్డుల గౌరవ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డిని కలిసిన సభ్యులు

రాయదుర్గం: అసెంబ్లీ సమావేశాలలో హోంగార్డులు శుభవార్త వింటారని రాష్ట్ర హోంగార్డుల సంఘం గౌరవ అధ్యక్షుడు, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. జాతీయ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో రాష్ట్ర హోంగార్డుల సంఘం ప్రతినిధులు కలిసి సమస్యలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో 16వేల మంది హోంగార్డుల కుటుంబాలు ఉన్నాయని, వారికి న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో హోంగార్డుల సేవలు ఎంతో అవసరమని, డిసెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో సీఎం శుభవార్త చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్, నాయకులు డాక్టర్ కొత్వాల్ దయానంద్, హరిబాబు, హనుమంత్‌రెడ్డి, అశోక్‌కుమార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక వినియోగంలో ముందుండాలి




ఎస్కీలో శిక్షణలో పాల్గొన్న ఇంజనీర్లు

- వృత్తిలో నైపుణ్యం పెంపుదలకు శిక్షణ అవసరం
- ఎన్ఆర్ఐడీఏ న్యూఢిల్లీ ప్రాజెక్ట్–1 డైరెక్టర్ ప్రదీప్ అగర్వాల్

రాయదుర్గం: ప్రతి ఒక్కరు తమ వృత్తిలో రాణించాలంటే శిక్షణ అవసరమని ఎన్ఆర్ఐడీఏ న్యూఢిల్లీ ప్రాజెక్ట్–1 డైరెక్టర్ ప్రదీప్‌అగర్వాల్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ డివిజన్, ఎస్కీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 36 మంది ఇంజనీర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో సాంకేతికత వినియోగం మరింత పెరిగితేనే పనుల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. సాంకేతిక వినియోగంలో అందరూ ముందుండాలని ఆయన సూచించారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు నాయకత్వంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, అస్సాం, ఛత్తీస్‌ఘడ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, లడఖ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర కేరళ, మేఘాలయ, మిజోరామ్, నాగాలాండ్, ఉత్తప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు చెందిన 26 మంది ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన ప్రాజెక్టుకు చెందిన ఇంజనీర్లకు అయిదు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. రోడ్ల నిర్మాణం, సాంకేతిక వినియోగం, నాణ్యత వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఘనంగా 'బాలోత్సవ్'



గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం బాలోత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్లానటరీ సొసైటీ వ్యవస్థాపకుడు రఘునందన్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వివిధ వేషధారణలు, చిత్రలేఖనం, జానపద గేయాలు, నృత్యాలు, నాటికలు, పాటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు గండిపేట ఎంఈఓ విజయకుమార్, చొక్కాపు వెంకటరమణ బహుమతులను అందించారు. బాలోత్సవ్ కన్వీనర్ విజయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, శ్రీనివాస్, రవీందర్, అనిల్, సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఇందిరా మహిళాశక్తి బజార్

మాదాపూర్ శిల్పారామంలోని నైట్‌బజార్‌లో ఇందిరా మహిళాశక్తి స్టాళ్లు ప్రారంభమయ్యాయి. గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వెదురు, గ్లాస్, మట్టితో తయారు చేసిన ఉత్పత్తులు ఆకర్షణగా ఉన్నాయి. జ్యూట్ బ్యాగ్స్, గాజులు, గృహాలంకరణ ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. బంజారా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను సందర్శకులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. – మాదాపూర్







నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

మణికొండ: ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా శనివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి నార్సింగిలో మహిళా శక్తి క్యాంటీన్, 9వ వార్డులో పార్కు, 10,15 వార్డులు మంచిరేవులలో సీసీ రోడ్లు, బతుకమ్మ ఘాట్, మోడ్రన్ లైటింగ్, కల్వర్టు, నార్సింగిలోని 6వ వార్డులో సర్కిల్‌ను ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: సెక్రటేరియట్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కమ్యూనిటీహాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఉదయం 9.30 గంటలకు మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఇందులో డాక్టర్ రావుస్ ఈఎన్‌టీ, శ్రీరాం ఆర్థో, అక్షయ డెంటల్, మెడికవర్ ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొని అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

15న దీన్‌దయాల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ –1 దీన్‌దయాల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 15వ తేదీన జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రదీప్‌రెడ్డి, టి.సంపత్ రెడ్డి ప్యానల్ తరపున ఎస్. ప్రదీప్‌రెడ్డి అధ్యక్షుడిగా, టి. సంపత్ రెడ్డి జనరల్ సెక్రటరీగా, ఎం కృష్ణ గౌడ్ ఉపాధ్యక్షుడిగా, కె. వెంకటేశ్వర్లు కోశాధికారిగా, పీవీ సుబ్బారెడ్డి జాయింట్ సెక్రటరీగా, కె. శ్రీధర్ బాబు కల్చరల్ సెక్రటరీగా నామినేషన్ పత్రాలను శుక్రవారం దాఖలు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు





రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని శుక్రవారం వైభవంగానిర్వహించారు. స్వామి వారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం హోమం చేశారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ సభ్యులు వివరాలను నమోదు చేసుకోవాలి

పటాన్‌చెరు: ఈపీఎఫ్ సభ్యులందరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవాంతరాలు లేని ఈపీఎఫ్ సేవలు పొందడం కోసం యూఏఎన్‌కి కెవైసీ వివరాలు (ఆధార్, బ్యాంక్ ఖాతా, పాన్) అప్డేట్ చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

ట్రాఫిక్ ఎస్ఐ రాములు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రాములు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ రాములు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు మండల పరిధిలోని పాశమైలారంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ ప్రారంభం

- 3 రోజుల పాటు కొనసాగింపు
- ప్రత్యేక రాయితీలను అందిస్తున్న ట్రావెల్ కంపెనీలు



ట్రావెల్ మార్ట్‌ను ప్రారంభించిన తెలంగాణ టూరిజం డైరెక్టర్ హనుమత్ కొండిబా తదితరులు

మాదాపూర్: హాస్పిటాలిటీ రంగాలకు చెందిన కీలక వాటాదారులతో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్‌మార్ట్‌ను శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో తెలంగాణ టూరిజం డైరెక్టర్ జెడ్. హనుమత్ కొండిబా నిర్వాహకులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టూరిజం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక వసతులను కల్పిస్తున్నట్టు తెలిపారు. స్పియర్ ట్రావెల్ మీడియా డైరెక్టర్ రోహిత్ హంగాల్ మాట్లాడుతూ ట్రావెల్ ఏజెంట్లకు సరైన వేదిక అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలు సేవలు, ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నారు. ప్రముఖ టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, స్టేట్ టూరిజం బోర్డులు, అంతర్జాతీయ డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. పుణ్యక్షేత్రాల ప్రయాణం, సాహస క్రీడలు, కుటుంబ సెలవులు హెరిటేజ్, హనీమూన్ వెళ్లేవారికి ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.తెలంగాణ, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, టర్కీ , మలేషియా, వియత్నాం వంటి 10కి పైగా దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ భాగస్వాములతో పాటు 20కి పైగా భారతీయ రాష్ట్రాల నుంచి పర్యాటక వాటాదారులు , బాలి, థాయిలాండ్, నేపాల్, భూటాన్, మాల్దీవులకు మార్కెటింగ్ చేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో పలు ట్రావెల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.